క్లుప్తంగా

26న కలెక్టరేట్ వద్ద ధర్నా


హమాలీలతో మాట్లాడుతున్న అప్పారావు

కొత్తవలస: కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలపై ఈనెల 26వ తేదీన విజయనగరం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించనున్నట్లు ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం నాయకుడు గాడి అప్పారావు తెలిపారు. మండల కేంద్రం సబ్బవరం రోడ్డులో హమాలీలతో శుక్రవారం ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విశాఖపట్నం స్టీల్ ప్లాంట్‌తో పాటు ఇతర ప్రభుత్వరంగ సంస్థల ప్రైవేటీకరణను నిలిపివేయాలని, నాలుగు లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని, కనీస వేతనం రూ.26 వేలు అమలు చేయాలని కోరారు. ఈ డిమాండ్ల సాధన కోసం నిర్వహించనున్న ధర్నాను విజయవంతం చేయాలని కోరారు.

వాహన తనిఖీలు


వాహన తనిఖీలు చేస్తున్న ఎస్ఐ దేవి

వేపాడ: మండలంలోని బొద్దాం జంక్షన్‌లో వల్లంపూడి ఎస్ఐ దేవి శుక్రవారం వాహన తనిఖీలు నిర్వహించారు. వాహన చోదకుల లైసెన్స్, వాహన పత్రాలను పరిశీలించారు. హెల్మెట్ ధరించని, లైసెన్స్ లేని ద్విచక్రవాహన చోదకులకు ఈ–చలానాలు విధించారు. వాహనచోదకులు విధిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, కారులో ప్రయాణించే వారు సీటు బెల్ట్ పెట్టుకోవాలని సూచించారు. అనంతరం అరిగిపాలెం గ్రామంలో ప్రజలకు వివిధ చట్టాలపై సీఐ రవికుమార్, ఎస్ఐ దేవి అవగాహన కల్పించారు.

యూటీఎఫ్ మహాసభ


మహాసభలో మాట్లాడుతున్న యూటీఎఫ్ గౌరవ అధ్యక్షుడు రామసత్యం

వేపాడ: యూటీఎఫ్ మండల మహాసభను సోంపురంలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుల సమస్యలపై పరిష్కరించారు. అనంతరం యూటీఎఫ్ మండల కార్యవర్గాన్ని సంఘం సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా పిన్నింటి వెంకటరమణ, గౌరవ అధ్యక్షుడిగా రావాడ రామసత్యం, సహ ధ్యక్షుడిగా పులి బంటి నాయుడు, ప్రధాన కార్యదర్శిగా ఇమంది జగదీశ్వరరావు, మహిళా విభాగం అధ్యక్షురాలిగా సీహెచ్. దేవి, కోశాధికారిగా పి.చిరంజీవి, కార్యదర్శులుగా సతీష్, ప్రసాద్,మహేష్, శంకరరావు, వెంకటరావు, ఆడిట్ కమిటీ సభ్యులుగా సత్యనారాయణ, రాముడు, సన్యాసిరావు, భాస్కరరావు ఎన్నికయ్యారు. యూటీఎఫ్ నాయకులు గొలగాన రాజారావు, తదితరులు పాల్గొన్నారు.

పశుగణన సర్వే పరిశీలన


వేపాడలో పశుగణన సర్వేను పరిశీలిస్తున్న ఏడీ చలపతిరావు

వేపాడ: మండల కేంద్రంలో పశువైద్య సహాయకులు శుక్రవారం చేపట్టిన పశుగణన సర్వే ను పశుసంవర్ధక శాఖ ఏడీ చలపతిరావు పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ 21వ అఖిలభారత పశుగణన సర్వే అక్టోబర్ 25న ప్రారంభమైందని, గ్రామాల్లో పశువైద్య సహాయకులు ఇంటింట సర్వే చేస్తున్నారని చెప్పారు. సర్వేలో భాగంగా ఆవులు, గేదెలు, మేకలు, గొర్రెలు, పందులు, కుక్కలు, కోళ్లు, తదితర వివరాలు సేకరిస్తున్నారని, ఇప్పటివరకు 10శాతం సర్వే పూర్తయ్యిందని పేర్కొన్నారు.

రాష్ట్రస్థాయి త్రోబాల్ పోటీలకు ఎంపిక


విద్యార్థులను అభినందిస్తున్న మోడల్ స్కూల్ ఉపాధ్యాయులు

దత్తిరాజేరు: రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ త్రోబాల్ పోటీలకు షికారుగంజి మోడల్ స్కూల్ విద్యార్థులు ఇద్దరు ఎంపికయ్యారని ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ దేవకి శుక్రవారం తెలిపారు. ఇటీవల విజయనగరంలోని రాజీవ్ క్రీడా మైదానంలో నిర్వహించిన జిల్లాస్థాయి పోటీల్లో బాలికల విభాగంలో టి.జాహ్నవి(ఇంటర్మీడియట్), ఎస్.చరణ్ (9వ తరగతి) ఉత్తమ ప్రతిభ కనబరచడంతో రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించారని చెప్పారు. ఈనెల 25,26వ తేదీల్లో విశాఖపట్నం జిల్లా పరవాడలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో వీరు జిల్లా తరఫున ప్రాతినిధ్యం వహించనున్నారని తెలిపారు. విద్యార్థులను, పీఈటీ రాజేష్‌ను ప్రిన్సిపాల్‌తో పాటు ఉపాధ్యాయులు అభినందించారు.

శిథిల బడి

- శిథిలావస్థలో పాఠశాలల భవనాలు
- పెచ్చులూడుతున్న శ్లాబ్‌లు
- బిక్కు బిక్కుమంటూ విద్యార్థులు
- గజపతినగరం మండలంలో ప్రభుత్వ పాఠశాలల సంఖ్య: 55
- గత ప్రభుత్వంలో నాడు –నేడులో భాగంగా అభివృద్ధి పనులు జరిగిన పాఠశాలలు: 31


కూలేదశలో ఎం.వెంకటాపురం ప్రాథమిక పాఠశాల భవనం


శిథిలావస్థలో మర్రివలస ప్రాథమిక పాఠశాల భవనం


మర్రివలస పాఠశాలలో పెచ్చులూడిన శ్లాబ్

గజపతినగరం: పలుగ్రామాల్లో ప్రభుత్వ పాఠశాలల భవనాలు శిథిలావస్థకు చేరుకోవడంతో విద్యార్థులు భయం భయంగా చదువులు సాగిస్తున్నారు. మండలంలో 42 ప్రాథమిక, 5 ప్రాథమికోన్నత, 6 ఉన్నత పాఠశాలలు, మోడల్ స్కూల్, కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంతో కలిపి మొత్తం 55 పాఠశాలలు ఉన్నాయి. ఈ పాఠశాలల్లో 3,846 మంది విద్యార్థులు చదువుతున్నారు. మర్రివలస, ఎం.వెంకటాపురం, రంగుపురం ప్రాథమిక పాఠశాలలు, కెంగువ ప్రాథమికోన్నత పాఠశాలల భవనాలు ఏన్నో ఏళ్ల క్రితం నిర్మించినవి కావడం తో ప్రస్తుతం శిథిలావస్థకు చేరుకున్నాయి. మర్రివలస పాఠశాల భవనం శ్లాబ్ పెచ్చులు ఊడి రాలిపోతున్నాయి. వర్షం కురిస్తే శ్లాబ్ నుంచి నీరు కారుతుండడంతో తరగతుల నిర్వహణ ఉపాధ్యాయులకు కష్టంగా మారుతోంది. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని విద్యా ర్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఇటీవల కెంగువ గ్రామంలో పర్యటించిన మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌ను తమ గ్రామంలో పాఠశాల భవనం శిథిలావస్థకు చేరుకుందని, నూతన భవనం మంజూరు చేయాలని గ్రామస్తులు కోరారు. మంత్రి సానుకూలంగా స్పందిస్తూ నూతన భవనాలు మంజూరు చేస్తామని హామీ ఇచ్చి వెళ్లి పోయారు.మండలంలోని 55 పాఠశాలల్లో 31 పాఠశాలల్లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నాడు –నేడులో భాగంగా రెండు విడతల్లో అభివృద్ధి పనులు చేసిందని....కూటమి ప్రభుత్వం మిగిలిన పాఠశాలల్లో భవనాలకు మరమ్మతులు చేయించాలని, అవసరమైన చోట నూతన భవనాలు నిర్మించాలని మండలంలోని విద్యావేత్తలు, విద్యార్థుల సంఘాలు, తల్లిదండ్రులు కోరుతున్నారు.

ప్రతిపాదనలు పంపించాం

మండలంలో కెంగువ,ఎం.వెంటాపురం గ్రామాల పాఠశాలలకు నూతన భవనాలు మంజూరు చేయాలని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాం. సమస్యను మంత్రి కొండపల్లి శ్రీనివాస్ దృష్టికి తీసుకువెళ్లాం. ఆయన సానుకూలంగా స్పందించారు.

– సాయిచక్రధర్, ఎంఈఓ–2

మొక్కల పెంపకానికి ప్రాధాన్యం


బొండపల్లిలో వనమిత్ర కేంద్రాన్ని పరిశీలిస్తున్న పంచాయతీ రాజ్, ఉపాధి హామీ పథకం డిప్యూటీ కార్యదర్శి ఆశిష్ గుప్త


గజపతినగరం మండల పరిషత్ కార్యాలయంలో మొక్కలు నాటుతున్న అధికారి ఆశిష్ గుప్త

బొండపల్లి: ఉపాధి హామీ పథకంలో భాగంగా మొక్కల పెంపకానికి కేంద్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందని పంచాయతీరాజ్, జాతీయ ఉపాధి హామీ పథకం డిప్యూటీ కార్యదర్శి ఆశిష్ గుప్త తెలిపారు. స్థానిక వనమిత్ర కేంద్రాన్ని శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ వనమిత్ర కేంద్రా ల్లో నర్సరీల నిర్వహణకు కావాల్సిన అన్ని వసతులను ఉపాధి హామీ పథకం నిధులతో కల్పిస్తామని చెప్పారు.అందులో భాగంగానే వనమిత్ర కేంద్రాలను సందర్శిస్తున్నామని తెలిపారు. ఆయన వెంట సోషల్ ఫారెస్ట్ డైరెక్టర్ షణ్ముకరావు, డీఎఫ్ఓ ప్రసన్న, డ్వామా పీడీ కల్యాణ చక్రవర్తి, ఏపీఓ బి.కృష్ణవేణి, ఎంపీడీఓ జి.గిరిబాల, వనమిత్ర కేంద్రం సహాయకులు పడాల అప్పలనాయుడు, తదితరులున్నారు.

విరివిగా మొక్కలు నాటాలి

గజపతినగరం: పర్యావరణ పరిరక్షణ కోసం ఉపాధి హామీ పథకంలో భాగంగా విరివిగా మొక్కలు నాటి, సంరక్షించాలని పంచాయతీ రాజ్, జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం డిప్యూటీ కార్యదర్శి ఆశిష్ గుప్త సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయాన్ని శుక్రవారం ఆయన సందర్శించారు. ఉపాధి పనులకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. ప్రభుత్వ కార్యాలయాలు, రోడ్లకు ఇరువైపులా మొక్కలు నాటాలని అధికారులకు సూచించారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటారు. సోషల్ ఫారెస్ట్ డైరెక్టర్ షణ్ముకరావు, డీఎఫ్ఓ ప్రసన్న, డ్వామా పీడీ కల్యాణ చక్రవర్తి, ఏపీడీ కిరణ్, ఎంపీపీ బెల్లాన జ్ఞానదీపిక, ఎంపీడీఓ బి.కల్యాణి, ఏపీఓ సీహెచ్ రామారావు పాల్గొన్నారు.

కళింగ కోమటి సంఘం వనసమారాధన రేపు

చీపురుపల్లి: ఈ నెల 24న కళింగ కోమటి సంఘం కార్తీక వనసమారాధన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఆ సంఘం చీపురుపల్లి పట్టణ అధ్యక్షుడు పొట్నూరు నర్సింగరావు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని శివరాం రోడ్‌లోని ఆర్ఈసీఎస్ ప్రధాన కార్యాలయం ఎదురుగా ఉన్న తోటలో కార్తీక వనభోజనాలు ఉంటాయని, కళింగ కోమటి సామాజిక వర్గానికి చెందిన వారంతా కుటుంబ సభ్యులతో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

నేడు బడ్జెట్ సమావేశం

చీపురుపల్లి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ ఇప్పిలి వెంకటనర్సమ్మ అధ్యక్షతన శనివారం బడ్జెట్ సమావేశం నిర్వహించనున్న ట్లు ఎంపీడీఓ ఏ.సరళ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గంటలకు ప్రారంభం కానున్న సమావేశంలో 2024–25 ఆర్థిక సంవ త్సరానికి సంబంధించి సవరణ బడ్జెట్, 2025–26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి అంచనా బడ్జెట్ ఆమోదం కోసం ఈ సమావేశం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు హాజరు కావాలని కోరారు.

ఆడ దూడలకు టీకాలు

వేపాడ: నాలుగు నుంచి ఎనిమిది నెలలు వయస్సు ఉన్న ఆడ ఆవు, గేదె దూడలకు బ్రూసెల్లోసిస్ వ్యాధి నివారణ టీకాలు వేయాలని ఏడీ చలపతిరావు పశువైద్య సిబ్బందికి సూచించారు. వేపాడ,వావిలపాడు రైతు సేవా కేంద్రాల్లో శుక్రవారం ఆయన తనిఖీలు నిర్వహించారు. రికార్డుల పరిశీలన అనంతరం, ఆయన మాట్లాడుతూ బ్రూసెల్లోసిస్ టీకాల కార్యక్రమం రెండో విడతను ఈనెల 20న ప్రారంభించామని చెప్పారు. బ్రూసెల్లోసిస్ వ్యాధి పశువుల నుంచి మనుషులకు వచ్చే అవకాశం ఉందన్నారు. టీకాలు వేయడం వల్ల ఆవులు,గేదెల్లో అబార్షన్‌ను నివారించవచ్చని తెలిపారు. పశు వైద్యసిబ్బంది గ్రామాల్లోకి వచ్చి ఆడ ఆవు, గేదె దూడలకు టీకాలు వేస్తారని, పాడి రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగించుకోవాలని సూచించారు.

ప్రస్తుత సమయాన్నే కొనసాగించాలి

- పీఆర్‌టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు రాంబాబు


విలేకరులతో మాట్లాడుతున్న పీఆర్‌టీయూ నాయకులు అల్లిరాంబాబు, తదితరులు

మెరకముడిదాం: పాఠశాలలకు ప్రస్తుతం ఉన్న సమయాలనే కొనసాగించాలని పీఆర్‌టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు అల్లి రాంబాబు ప్రభుత్వాన్ని కోరారు. శుక్రవారం ఆయన పీఆర్‌టీయూ మండల నాయకులతో కలిసి చినబంటుపల్లి ప్రాథమికోన్నత పాఠశాల వద్ద విలేకరులతో మట్లాడుతూ.. ప్రభుత్వం పైలెట్ ప్రాజెక్ట్ కింద మండలానికి రెండు పాఠశాలలు చొప్పున సమయాన్ని మార్చుతున్నట్లు ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 వరకు పాఠశాలలు నిర్వహించాలని ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో విద్యార్థులు, ఉపాధ్యాయులకు ఇబ్బందులు ఎదురవుతాయన్నారు. విద్యార్థులు కూడా ఇళ్లకు వెళ్లేందుకు ఇబ్బంది పడతారని చెప్పారు. ఈ విషయాలను దృష్టిలో ఉంచుకుని కొత్త సమయాలపై తీసుకున్న నిర్ణయాన్ని వెంటనే ఉప సంహరించుకోవాలని కోరారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ నాయకులు ఆర్.సింహాద్రి, టి.మహేష్, బి.శ్రీదేవి, కె.త్రివేణి, వి.మెహనరావు, టి.రమేష్, ముత్యాలప్పడు, రామారావు పాల్గొన్నారు.

గిరిజనులకు సహాయం

దత్తిరాజేరు: ఆర్.రామచంద్రపురం పంచాయతీ పరిధి గిరిశిఖర గ్రామం ఎస్.టి.వలసలోని గిరిజనులు, విద్యార్థులకు అభ్యుదయ, సహాయ, అమ్మసేవ ఫౌండేషన్లు సహాయం అందించాయి. స్వచ్ఛంద సంస్థలు సమకూర్చిన సోలార్ ప్లేట్లు, బిందెలు, దుప్పట్లు, చీరలు, సైకిళ్లు, పుస్తకాలను లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు బీశెట్టి బాబ్జీ, బొబ్బిలి అభ్యుదయ స్కూల్ కరస్పాండెంట్ ఎం.కె.నాయుడు శుక్రవారం పంపిణీ చేశారు. అభ్యుదయ, సహాయ స్ఫూర్తి, అమ్మ సేవ ఫౌండేషన్‌ల అధ్యక్షులు చింత శారద, సాయికుమార్, సురేష్ పాల్గొన్నారు.


గిరిజనులు, విద్యార్థులకు సైకిళ్లు, ఇతర సామగ్రి అందజేస్తున్న బాబ్జీ, సేవా సంస్థల ప్రతినిధులు

జోనల్ స్పోర్ట్స్ మీట్ చాంపియన్‌గా వియ్యంపేట


విద్యార్థినులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ జయశ్రీ, ఉపాధ్యాయినులు

కొత్తవలస: జోనల్ స్పోర్ట్స్ మీట్–2024లో ఓవరాల్ చాంపియన్‌గా మండలంలోని వియ్యంపేట బి.ఆర్.అంబేడ్కర్ బాలికల ఆశ్రమ పాఠశాల నిలిచిందని ఆ పాఠశాల ప్రిన్సిపాల్ టి.జయశ్రీ శుక్రవారం తెలిపారు.శ్రీకాకుళం జిల్లా ఎచ్చెర్ల మండలంలో ఈనెల14వ తేదీ నుంచి 17వరకు నిర్వహించిన పోటీల్లో జూనియర్స్ విభాగం 100 మీటర్లు, 800 మీటర్లు, 150 మీటర్ల పరుగు పందెం, డిస్క్‌త్రో, జావెలిన్‌త్రో, త్రోబాల్, హైజంప్ పోటీల్లో పాఠశాల విద్యార్థినులు ప్రథమ స్థానం, సీనియర్స్ విభాగంలో క్యారమ్స్‌లో ద్వితీయ స్థానం, వందమీటర్ల రన్నింగ్‌లో తృతీయ స్థానంలో నిలిచారని చెప్పారు. విద్యార్థినులను ప్రిన్సిపాల్‌తో పాటు పాఠశాల సిబ్బంది అభినందించారు.

రామలింగేశ్వర ఆలయంలో లక్ష బిల్వార్చన


వివిధ పుష్పాల అలంకరణలో రామలింగేశ్వరస్వామి, అమ్మవార్లు


స్వామి వారికి లక్ష బిల్వార్చన చేస్తున్న అర్చకులు

కొత్తవలస: కొత్తసుంకరపాలెంలోని రామలింగేశ్వరస్వామి ఆలయంలో గ్రామ పెద్దలు పెదిరెడ్ల శ్రీనివాసరావు, తదితరుల ఆధ్వర్యంలో స్వామివారికి శుక్రవారం భక్తి శ్రద్ధలతో లక్ష బిల్వార్చన చేశారు. అర్చకులు స్వామి వారు, అమ్మ వార్లను వివిధ పుష్పాలతో అలకంరించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు.అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

మానసాదేవి ఆలయానికి పోటెత్తిన భక్తులు


పూజల్లో పాల్గొన్న భక్తులు


పూజలందుకుంటున్న అమ్మవారు

చీపురుపల్లి: కార్తీకమాసంతో పాటు శుక్రవారం కావడంతో మండలంలోని రామలింగాపురం సమీపంలోని మానసాదేవి నాగశక్తి అమ్మవారి ఆలయానికి భక్తులు పోటెత్తారు. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం జిల్లాల నుంచి వచ్చిన భక్తులతో తెల్లవారు జామున 4 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. అర్చకులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. మహిళలతో కుంకుమ పూజలు చేయించారు.

అర్హులకు ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలి


రాచకిండాం సచివాలయ కార్యదర్శికి వినతిపత్రం అందజేస్తున్న వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు

బొండపల్లి: గ్రామాల్లో అర్హులందరికీ ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పురం అప్పారావు డిమాండ్ చేశారు. మండ లంలోని రాచకిండాం గ్రామంలో సచివాలయ కార్యదర్శి ఆర్.వరంనకు వ్యవసాయ కార్మిక సంఘం మండల నాయకులు, గ్రామస్తులు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి అయిదు నెలలు పూర్తయినా ఎన్నికల హామీల్లో ఒక్కటి కూడా అమలు చేయలేద న్నారు. ఇళ్ల స్థలాలు లేని పేదలకు గ్రామాల్లో 3 సెంట్లు, పట్టణాల్లో 2 సెంట్ల స్థలం, ఇంటి నిర్మాణానికి రూ.5లక్షలు ఇస్తామని ఎన్నికల్లో కూటమి నాయకులు హామీ ఇచ్చా రని, ఆమాట నిలబెట్టుకోవాలని కోరారు. వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు మామిడి వెంకటరమణ, ఎన్.రాము, సీహెచ్.రాము, వినోద్‌కుమార్ పాల్గొ న్నారు.

జాబ్ మేళా


జాబ్‌మేళాలో మాట్లాడుతున్న డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సత్యనారాయణ, తదితరులు

గజపతినగరం: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం జాబ్‌మేళా నిర్వహించారు. ఫార్మాసూట్యికల్ రంగంలో ఉద్యోగాలు కల్పించేందుకు పలు బహుళజాతి పరిశ్రమల ప్రతినిధులు నిర్వహించిన ఇంటర్వ్యూలకు టెన్త్, ఇంటర్మీడియట్, ఐటీఐ, డిగ్రీ, పీజీ చేసిన విద్యార్థులు సుమారు 150 మంది హాజరయ్యారు. ప్రిన్సిపాల్ రావాడ సత్యనారాయణ మాట్లాడుతూ నిరుద్యోగ యువత ఇలాంటి జాబ్ మేళాలను సద్వినియోగించుకోవాలని, అందివచ్చిన అవకాశాలతో ప్రతిభను నిరూపించుకుని అంచెలంచెలుగా ఎదగాలని సూచించా రు. జాబ్ మేళాలో ఎంపికైన వారికి రెండు,మూడు రోజుల్లో ఆయా కంపెనీల ప్రతినిధులు సమాచారం అందిస్తారని చెప్పారు. ఫార్మా కంపెనీల ప్రతినిధులు, ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రకాశ రావు పట్నాయక్, అధ్యాపకులు పాల్గొన్నారు.

గంజాయిపై ఉక్కుపాదం మోపండి


గజపతినగరం: గజపతినగరం పోలీస్ స్టేషన్‌లో పోలీసుల గౌరవ వందనాన్ని స్వీకరిస్తున్న ఎస్పీ వకుల్ జిందాల్


దత్తిరాజేరు: ఎస్.భూర్జవలస పోలీస్ స్టేషన్‌లో వివిధ కేసుల్లో సీజ్ చేసిన వాహనాలను పరిశీలిస్తున్న ఎస్పీ వకుల్ జిందాల్

గజపతినగరం/దత్తిరాజేరు: గంజాయి రవాణా, విక్రయాలపై ఉక్కుపాదం మోపాలని పోలీస్ సిబ్బందికి జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ సూచించారు. గజపతినగ రం, దత్తిరాజేరు మండలంలోని ఎస్.భూర్జవలస పోలీస్ స్టేషన్‌లలో శుక్రవారం ఆయన తనిఖీలు చేశారు. రికార్డులతో పాటు స్టేషన్‌ల ఆవరణలో ఉన్న వివిధ కేసుల్లో సీజ్ చేసిన వాహనాలను పరిశీలించారు. సిబ్బందితో సమావేశమై పెండింగ్ కేసుల వివరాలపై ఆరా తీశారు. సిబ్బంది సమస్యలను తెలుసుకుని, పరి ష్కారానికి చర్యలు తీసుకుంటా మని చెప్పారు. మాదకద్రవ్యాలు, గంజాయి తీసుకోవడం వల్ల కలిగే అనర్థాలపై 'సంకల్పం' పేరుతో అవగాహన సదస్సులు నిర్వహించి, విద్యార్థులు, యువత పక్కదారి పట్టకుండా చూడాలని చెప్పారు. పోలీస్ సిబ్బంది తాము దత్తత తీసుకున్న గ్రామాల్లో తరచూ పర్యటించి ప్రజలతో మమేకం కావాలని, గ్రామాల్లో అసాంఘిక కార్యకలాపాలు జరగుండా చూడాలని, శాంతి భద్రలకు విఘాతం కలిగితే మహిళా పోలీస్‌లు ఎస్ఐలకు సమాచారం అందించాలని సూచించారు. రోడ్డు ప్రమాదాల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని, తరచూ ప్రమాదాలు జరిగే ప్రాంతాలు, మలుపుల వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఆయన వెంట బొబ్బిలి డీఎస్పీ పి.శ్రీనివాసరావు, గజపతినగరం సీఐ జి.ఏ.వి.రమణ, గజపతినగరం, ఎస్.భూర్జవలస, పెదమానాపురం ఎస్ఐలు లక్ష్మణరావు, రాజేష్, జయంతి ఉన్నారు.

రెల్లరాల్చు పురుగు పట్ల అప్రమత్తం


వరి పంటను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు, శాస్త్రవేత్తలు

బొండపల్లి: ప్రస్తుతం వరి పంట కోత దశలో ఉన్నప్పటికీ, రెల్లరాల్చు పురుగు ఆశిస్తోందని ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త కె. లక్ష్మణ్ అన్నారు. ఈ పురుగు పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మండలంలోని నెలివాడ, కనిమెరక గ్రామాల్లోని వరి పోలాలను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఈ పురుగు రాత్రి పూట కంకులపై ఆశించి కొరికి వేస్తాయన్నారు. దీనివల్ల దిగుబడి బాగా తగ్గిపోతుందని చెప్పారు. దీని నివారణకు కోతకు మూడు రోజులు ముందు లీటర్ నీటిలో 200 ఎం.ఎల్ క్లోరిపైరిఫాస్ మందు కలిపి ఎకరాకు సరిపడా పిచికారీ చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో గజపతినగరం ఏడీఏ కె.మహరాజన్, బొండపల్లి ఏఓ పీవీ మల్లికార్జునరావు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.